# ముఖ్యమంత్రి కార్యాలయము

## తెలంగాణ ప్రభుత్వం

పత్రికా ప్రకటన-2 20, ఫిబ్రవరి, 2015

వ్యవసాయ ఉత్పత్తులను కొనుగోలు చేయడం వరకే పరిమితం కాకుండా వాటి నిలువ కోసం కూడా మార్కెటింగ్ శాఖ ప్రణాళికాబద్ధంగా గోదాముల నిర్మాణం చేపట్టాలని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు అన్నారు. రైతులకు అవసరమయ్యే విత్తనాలు, ఎరువులు కూడా సకాలంలో అందించేందుకు ముందుగానే నిలువ చేసుకోవడానికి ఏర్పాట్లు చేయాలని సూచించారు. సచివాలయంలో మార్కెటింగ్ శాఖ మంత్రి టి.హరీష్‌రావు, పార్లమెంటరీ కార్యదర్శి జలగం వెంకట్రావ్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రాజీవ్‌శర్మ, మార్కెటింగ్ శాఖ కార్యదర్శి పూనం మాల కొండయ్య, అధికారులు ప్రియదర్శిని, లక్ష్మీబాయి తదితరులతో మార్కెట్ శాఖను సమీక్షించారు.

రాష్ట్రంలో ఏడాదికి ఎన్ని లక్షల టన్నుల వ్యవసాయ ఉత్పత్తులు వస్తున్నాయి, ఎన్ని టన్నుల నిలువ సామర్థ్యం కలిగిన గోదాములు ఉన్నాయి, ఎక్కడ గోదాముల అవసరం ఉంది అనే విషయాలపై అధ్యయనం చేసి అవసరమైన మేర, అనువైన చోట్ల కొత్త గోదాముల నిర్మాణం చేపట్టాలని ముఖ్యమంత్రి సూచించారు. ప్రస్తుతం ప్రభుత్వరంగ సంస్థలు, మార్కెటింగ్ శాఖ, వ్యవసాయ పరపతి సంఘాలు, డ్వాక్రా సంఘాలు ధాన్యం కొనుగోలు చేస్తున్నాయని, వీరందరూ కూడా పరస్పర సమన్వయంతో కొనుగోళ్లు, నిలువ, గోదాముల నిర్వహణ చేపట్టాలని సూచించారు.

గోదాములను ధాన్యం, మొక్కజొన్న లాంటి వ్యవసాయ ఉత్పత్తుల నిలువ కోసమే కాకుండా ఎరువులు, విత్తనాల నిలువ కోసం కూడా ఉపయోగించాలని ముఖ్యమంత్రి సూచించారు. ప్రతి వ్యవసాయ సీజన్‌లో రైతులు ఎరువుల కోసం రోడ్డు ఎక్కడం పరిపాటి అయ్యిందని అన్నారు. ఈ పరిస్థితి పోవాలంటే తెలంగాణలో ఎన్ని టన్నుల ఎరువుల అవసరం

ఉందో ముందే అంచనా వేసి వేసవి కాలంలోనే వాటిని తెప్పించి గోదాముల్లో నిలువ చేసుకోవాలని సూచించారు. ఎండాకాలంలో ఎరువులు, విత్తనాల నిలువ కోసం, వర్షా కాలం తరువాత వ్యవసాయ ఉత్పత్తుల నిలువ కోసం గోదాములను ఉభయతారకంగా ఉపయోగించుకోవాలని సూచించారు. వ్యవసాయ ఉత్పత్తులు ఏ ప్రాంతంలో ఎక్కువగా వస్తున్నాయో గుర్తించి ఆ ప్రాంతంలోనే ఎక్కువ గోదాములు నిర్మించాలని సూచించారు. మార్కెటింగ్ శాఖలో పెట్టే ప్రతి రూపాయి ఖర్చు రైతులకు ఉపయోగపడాలని సూచించారు. మార్కెట్లలో తడిసిన ధాన్యం తీసుకురావడం వల్ల రైతులకు రేటు తక్కువగా వస్తున్నదని ముఖ్యమంత్రి అన్నారు. దీనిని నివారించడానికి మార్కెట్లలో డ్రైయ్యర్లను పెట్టాలని సూచించారు. నకిలీ ఎరువులు, పురుగు మందులు, కల్తీ విత్తనాల నిరోధానికి కఠినంగా వ్యవహరించాలని సూచించారు. ఫర్టిలైజర్ మిక్సింగ్ ప్లాంట్లలో కూడా మోసాలు జరుగుతున్నాయని, ఎరువు పేరుతో మట్టిని కలిపి మోసం చేస్తున్నారని ముఖ్యమంత్రి అన్నారు. ఈ విషయంలో కూడా అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. కోల్డ్ స్టోరేజ్‌ల నిర్మాణం విషయంలో కూడా జాగ్రత్తగా ఉండాలని, ఏ ఏ వ్యవసాయ ఉత్పత్తులకు ఎంత మేర చల్లదనం అవసరమో గుర్తించి కోల్డ్ స్టోరేజ్‌లలో ప్రత్యేక ఛాంబర్‌లు ఏర్పాటు చేయాలని సూచించారు.

---

సిపిఆర్ఓ టు సిఎం